
వ్యాధుల భయం

- కురుస్తున్న వర్షాలతో విష జ్వరాలు ప్రబలే అవకాశం
- నీటి నిల్వలే దోమల ఉత్పత్తికి ఆవాసాలు
- జోన్–3లో అరకొర సిబ్బందితోనే డ్రైడే, దోమల నిర్మూలన కార్యక్రమాలు
- ముందు జాగ్రత్త చర్యలతో రక్షణ



17వ వార్డులో దోమల లార్వా గుర్తిస్తున్న ఏఎల్‌వో సిబ్బందితో మలేరియా సిబ్బంది (ఫైల్)

మద్దిలపాలెం: తాజాగా కురుస్తున్న వర్షాలతో వ్యాధులు సోకుతాయోమోనని స్థానిక ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పుల వల్ల వైరల్ ఫీవర్స్ ప్రబలుతున్నాయి. మరోవైపు దోమ కాటు ద్వారా డెంగ్యూ, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశాలున్నాయి. వర్షాల కారణంగా పేరుకుపోయిన నీటి నిల్వలు దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారుతున్నాయి. ముందు జాగ్రత్తలో భాగంగా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వల తొలగింపు ప్రక్రియ చేపట్టడం ఎంతో అవసరం. ఈ చర్య ద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా జ్వరాల బారిన పడకుండా రక్షణ పొందగలం. జీవీఎంసీ పరిధిలోని వార్డుల్లో ఇంటింటి సందర్శన ద్వారా నీటి నిల్వలు తొలగించే ప్రక్రియను యాంటీ లార్వా ఆపరేషన్(ఏఎల్‌వో) సీజనల్ సిబ్బంది ద్వారా చేపట్టాల్సి ఉంది. జూన్ నెల గడుస్తున్నా.. ఇప్పటి వరకు వీరి భర్తీ చేయలేదు. జీవీఎంసీ మలేరియా విభాగంలో అరకొర సిబ్బందితోనే ఈ ప్రక్రియను అంతంత మాత్రంగా నిర్వహిస్తున్నారు.



ఫ్లెక్సీ మడతలో నిల్వ నీరు



గ్లాసులో వర్షపు నీరు



చిరిగిన షూలో చేరిన వర్షపు నీరు

ఏడు రోజుల్లోనే జ్వరం



దోమ కాటు వేసిన ఏడు రోజుల వ్యవధిలో జ్వరం వస్తుంది. ముందస్తుగా రక్త పరీక్షలు చేయించుకోవాలి. దానిలో మలేరియా నిర్ధారణైతే 15 రోజుల పాటు వైద్యం పొందాల్సి ఉంటుంది. మలేరియా నిర్ధారణ కాకపోతే వెంటనే డెంగ్యూ పరీక్ష చేసుకోవాలి. అది నిర్ధారణైతే వైద్యుడి సూచన మేరకు చికిత్స పొందాలి. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్‌తోపాటు ఖరీదైన వైద్య పరీక్షలన్నీ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా చేస్తున్నారు.

దీంతో జీవీఎంసీ జోన్–3 పరిధిలోని 14 వార్డుల్లో సీజనల్ వ్యాధులు, దోమలు వృద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

నీటి నిల్వల్లో దోమల ఉత్పత్తి

వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వర్షపు నీరు ఇంటి పరిసరాల్లోని ఖాళీ సీసాలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, రుబ్బురోలు తదితర వాటిలో నిల్వ ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రతి చిన్న ఖాళీ వస్తువులో నీటి నిల్వ ఉన్నా దోమల వృద్ధికి ఆవాసాలుగా మారుతాయి. వారం రోజులు దాటి నిల్వ ఉండే నీటిలో లార్వా ఏర్పడుతుంది. అది కాస్తా 12 రోజుల వ్యవధిలో వివిధ దశల అనంతరం దోమగా రూపాంతరం చెందుతుంది. దోమల కాటు ద్వారా విష జ్వరాలు ప్రబలుతాయి. ముందుగానే వీటిని నిర్మూలించాల్సి ఉంది.

డ్రైడే తప్పనిసరిగా పాటించాలి

ప్రతి శుక్ర, మంగళవారాల్లో నిర్వహించే డ్రైడే కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. దోమల ఉత్పత్తికి నిల్వ నీటి వనరులే కేంద్రాలు. వాటి తొలగింపు ఎంతో కీలకం. ఈ చర్యల్లో భాగంగా జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో యాంటీ లార్వా ఆపరేషన్ బృందం ఇంటింటి తనిఖీలు చేపడుతున్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను గుర్తించి తొలగిస్తారు. ముఖ్యంగా ఇంట్లో వినియోగించే ఫ్రిడ్జ్, ఏసీల నుంచి వచ్చే నీటిని ప్రధానంగా గుర్తించి తొలగించాలి. ఈ ప్రక్రియను తమ సూచనల మేరకు ప్రతి వారం ఎవరివారు చేపట్టడం ద్వారా దోమ కాటు నుంచి రక్షణ పొందగలుగుతారని మలేరియా సిబ్బంది చెబుతున్నారు.

సీజనల్ ఏఎల్‌వో సిబ్బంది నియామకంలో జాప్యం

క్షేత్రస్థాయిలో ఇంటింటి సందర్శన ద్వారా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను గుర్తించి తొలగించే యాంటీ లార్వా ఆపరేషన్(ఏఎల్‌వో) సిబ్బందిని జీవీఎంసీ ప్రతి ఏటా మే నుంచి నాలుగు మాసాల పాటు నియమిస్తుంది. ఇప్పటికే జూన్ ముగుస్తున్నప్పటికీ ఈ సిబ్బంది నియామకాలు చేయలేదు. దీంతో కురిసి వెలుస్తున్న వర్షాలకు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించే ప్రక్రియ ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ప్రస్తుతం జీవీఎంసీ మలేరియా విభాగంలో ఉన్న సిబ్బందితోనే ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఇది పూర్తి స్థాయిలో చేయడానికి వీలు కలగడం లేదు. దీంతో దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడేస్తాయని జోన్–3 ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



లక్ష్మీనగర్‌లోని ఓ ఇంటి వద్ద నీటి సంపులో ద్రావణం వేస్తున్న జీవీఎంసీ మలేరియా సిబ్బంది



డ్రమ్‌లోని నిల్వ నీరు పారబోయిస్తున్న సిబ్బంది

వారంలో ఏఎల్‌వో సిబ్బంది నియామకం



జీవీఎంసీ జోన్–3 పరిధిలో 14 వార్డులున్నాయి. ఒక్కో వార్డులో ముగ్గురు చొప్పున ఏఎల్‌వో సీజనల్ సిబ్బంది తాత్కాలిక నియామకానికి చర్యలు చేపడుతున్నాం. వారం రోజుల లోపు భర్తీ ప్రక్రియ పూర్తి కానుంది. ప్రస్తుతం ఫ్రైడే–డ్రైడే, ఇంటింటి సందర్శనను జీవీఎంసీ మలేరియా సిబ్బంది చేపడుతున్నారు. సీజనల్ సిబ్బంది భర్తీ కాగానే ప్రణాళిక బద్ధంగా ప్రతి వార్డులో ఇంటింటి సందర్శన, నీటి నిల్వల తొలగింపు, సీజనల్ వ్యాధులపై అవగాహన, ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాలను నిర్వహిస్తాం. కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంటి వద్ద నీటి నిల్వలను తొలగించుకోవాలి.

– డాక్టర్. బి.ప్రసాదరావు, ఏఎంహెచ్‌వో, జీవీఎంసీ జోన్–3

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు





స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: అమావాస్య సందర్భంగా బుధవారం 15వ వార్డు కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో కొలువైన కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి ప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మ భక్తుల పేరిట ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, శరకం సత్యారావు, బోర యర్రాజీ రెడ్డి, వేగి వెంకటరమణ, సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం



మాట్లాడుతున్న పరశురామరాజు

ఎంవీపీకాలనీ: దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామరాజు అన్నారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ నగర కార్యాలయంలో బుధవారం ఎమర్జెన్సీ వ్యతిరేక దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు కాంగ్రెస్ దుర్మార్గాన్ని జయప్రకాష్ నారాయణ వంటి మేధావులు అడ్డుకున్నారన్నారు. ఆనాటి రాజకీయ ప్రముఖుల ఉద్యమాల ఫలితంగా దేశంలో ప్రజాస్వామ్యం నిలబడిందని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన పలువురిని ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగన్నాథ రథయాత్ర రేపు

ఎంవీపీకాలనీ: ఈ నెల 27న హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం నుంచి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఈ యాత్ర ప్రారంభమవుతుంది. ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డు మీదుగా టీటీడీ కూడలి, ఇసుకతోట జంక్షన్, వెంకోజీపాలెం కూడలి, క్యాన్సర్ హాస్పిటల్, అప్పుఘర్ బీచ్ రోడ్డు మీదుగా రథయాత్ర సాగి.. తిరిగి ఐఐఏఎంకు చేరుతుంది. యాత్రలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, జగన్నాథ మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎడతెరిపి లేని వాన



మద్దిలపాలెం జంక్షన్‌లో జోరువాన

మద్దిలపాలెం: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షపు నీటితో రహదారులు తడిసి ముద్దయ్యాయి. కాలనీల్లో వాన నీరు నిలిచిపోయింది. బుధవారం కూడా రోజంతా వర్షం కురవడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు వానలో ఇబ్బంది పడ్డారు. మద్దిలపాలెం, కేఆర్‌ఎం కాలనీ, ఇసుకతోట మొదలగు లోతట్టు ప్రాంతాల్లో నీటి ప్రవాహంతో నిండిపోతున్నాయి. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి. 22వ వార్డులోని శివాజీపాలెం, పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్లు జలమయమయ్యాయి. వారం రోజులుగా ఎండ వేడి, ఉక్కపోతతో సతమతమైన ప్రజలకు జోరువాన ఊరటనిచ్చింది.


పల్లా సింహాచలం కృషి ఎనలేనిది



పల్లా సింహాచలం సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఒమ్మి సన్యాసిరావు

మద్దిలపాలెం: యాదవుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి పల్లా సింహాచలం అని విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఒమ్మి సన్యాసిరావు, బొట్టా వెంకటరమణ అన్నారు. 22వ వార్డు శివాజీపాలెంలో బుధవారం పల్లా సంస్మరణ సభ నిర్వహించారు. పల్లా సింహాచలం సేవలను, ఉత్తరాంధ్ర అభ్యున్నతికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఈగల సత్యం, సారిపల్లి కృష్ణ, గొంపా అప్పారావు, మొల్లి లక్ష్మణ, పి.ఆదిమూర్తి, బోసు, నొడగల అప్పారావు, గొలగాని పోలారావు, నమ్మి అప్పారావు, ఎస్ టీం సభ్యుడు పల్లా చిరంజీవి పాల్గొన్నారు.

మూలకు చేరిన ఎక్స్‌రే విభాగం



ఆరిలోవ ఎఫ్‌ఆర్‌యూలో మూతపడిన ఎక్స్‌రే విభాగం

ఆరిలోవ: ఆరిలోవలోని జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్(ఎఫ్‌ఆర్‌యూ)లో ఎక్స్‌రే విభాగం మూలకు చేరింది. సుమారు రెండేళ్లకు పైగా ఈ యూనిట్ మూతపడిపోయి ఉంది. అధికారులు దీన్ని పట్టించుకోకపోవడంతో ఇంతవరకు ఇది తెరుచుకోలేదు. ఇది ఎప్పుడు తెరుచుకుంటుందా అంటూ రోగులు ఎదురు చూస్తున్నారు. ఇక్కడ ఆస్పత్రి ఏర్పాటైనప్పటి నుంచి ఎక్స్‌రే అందుబాటులో ఉండేది. ఆర్థోపెడిక్ సమస్యలతో వెళ్లేవారికి ఇక్కడ నిర్ధారణ కోసం ఎక్స్‌రే ఉచితంగా తీసేవారు. సుమారు రెండేళ్ల కిందట ఎక్స్‌రే యంత్రం మరమ్మతులకు గురైంది. దీంతోపాటు ఇక్కడ పనిచేసిన ఎక్స్‌రే ఆపరేటర్‌ను వేరేచోటకు బదిలీ చేశారు. అప్పటి నుంచి ఎక్స్‌రే ఆపరేటర్‌ను నియమించలేదు సరికదా.. యంత్రాన్ని కూడా బాగుచేయకుండా వదిలేశారు. దీంతో ఎక్స్‌రే అవసరమైన రోగులు బయట ల్యాబ్‌లకు పరుగులెత్తాల్సి వస్తోంది. దాని కోసం రూ.వందలు ఖర్చు చేస్తున్నారు. ఇక్కడ ఎక్స్‌రే యంత్రాన్ని ఏర్పాటు చేసి ఆపరేటర్‌ను వెంటనే నియమించాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు.

నగర పరిశుభ్రతకు ప్రాధాన్యం

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్
- 21వ వార్డులో విస్తృత పర్యటన



అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

బీచ్‌రోడ్డు: విశాఖ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ప్రజారోగ్య అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. 21వ వార్డు చినవాల్తేరులోని మసీదు వీధి, విజయనగర్ కాలనీ, నేతాజీనగర్, కొయ్య వీధి, చినవాల్తేరు అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతలో భాగంగా కాలువల్లోని వ్యర్థాల తొలగింపు మొదలైనవి ప్రతి రోజు విధిగా చేపట్టాలన్నారు. పలుచోట్ల కాలువల్లో పారుతున్న మురుగునీటిని పరిశీలించి, నిత్యం శుభ్రం చేయాలని ఆదేశించారు. వార్డులోని పుష్ కార్ట్‌లను అన్ని చోట్ల వినియోగించేలా చర్యలు చేపట్టాలని జోన్–3 కమిషనర్ కె.శివప్రసాద్‌కు సూచించారు. వర్షా కాలంలో గెడ్డలు పొంగకుండా, కాలువల్లో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌కు ఆదేశించారు. మసీద్ వీధిలోని కాలువలు, రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలను గమనించి, యుద్ధప్రాతిపదికన వాటిని తొలగించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ప్లానింగ్ కార్యదర్శిని ఆదేశించారు. కొత్తగా భవనాలు నిర్మిస్తున్న వారు నిర్మాణ సామగ్రిని రోడ్లపై వేయకుండా చర్యలు చేపట్టాలని జెడ్సీని ఆదేశించారు. వీధుల్లో తాగునీటి సమస్య, వీధిలైట్ల నిర్వహణ గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లోని అన్ని వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి దుకాణం వద్ద తప్పనిసరిగా డస్ట్ బిన్లు ఉంచాలని, రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించరాదని వ్యాపారులకు సూచించారు. వార్డులోని అన్ని నివాసాలు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ కలిగి ఉండాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం చినవాల్తేరులోని మెంటల్ హాస్పిటల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను, దాని నిర్వహణను జీవీఎంసీ కమిషనర్ పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న వారికి సకాలంలో జీతాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నిత్యం వేడి ఆహార పదార్థాలను ప్రజలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. పర్యటనలో జీవీఎంసీ ఏఎంహెచ్‌వో బి.ప్రసాదరావు, ఈఈ గంగాధర్, సుధాకర్, పద్మావతి, ఏఈఈ విల్సన్, ఏపీడీ రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

'బెస్ట్ అవైలబుల్ స్కూల్' విద్యార్థులకు యూనిఫారం, పుస్తకాలివ్వాలి



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత హక్కుల సంఘం నాయకులు

ఆరిలోవ: బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం ఇవ్వాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతాడ జోగారావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం డీఈవో కార్యాలయం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో తమ పిల్లలకు సౌకర్యాలు కల్పించాలని, యూనిఫారం, పుస్తకాలు అందజేయాలని నినాదాలు చేశారు. అనంతరం జోగారావు మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కొనసాగించాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలల్లో 10 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బకాయిలు ఉండటంతో పాఠశాలల యాజమాన్యాలు ఎస్టీ, ఎస్సీ విద్యార్థులకు ఆయా సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. అనంతరం డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై డీఈవో స్పందించి నగరంలోని భాష్యం, చలపతి తదితర స్కూళ్ల ప్రిన్సిపాళ్లను కార్యాలయానికి పిలిపించి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద పుస్తకాలు, యూనిఫారం అందించాలని ఆదేశించారు. పాఠశాలలకు ఉన్న బకాయిల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు కనకరాజు, కనకమహాలక్ష్మి, త్రినాథ్, నాగరాజు, పావని, పార్వతి, గురుమూర్తి, దేవి, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

'అపోలో'లో క్యాన్సర్ విజేతల 'కెన్‌విన్' గ్రూప్



క్యాన్సర్ విజేతలతో అంకాలజీ వైద్యులు

ఆరిలోవ: అపోలో హాస్పిటల్ అంకాలజీ విభాగంలో బుధవారం క్యాన్సర్ విజేతలతో మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంకాలజీ విభాగం వైద్యులు కెన్‌విన్ గ్రూప్ ప్రారంభించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ ఈ గ్రూప్‌లో క్యాన్సర్ విజేతలు వారి అనుభవాలు, కథల గురించి వెల్లడిస్తారని తెలిపారు. వైద్యులు క్యాన్సర్‌కు సంబంధించిన సలహాలు, సూచనలిస్తున్నారన్నారు. ఈ గ్రూప్‌లో క్యాన్సర్ విజేతలతోపాటు క్యాన్సర్‌కు గురై చికిత్స పొందుతున్న వారు, అనుమానితులు కూడా ఉంటారన్నారు. క్యాన్సర్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, క్యాన్సర్ రోగులు ధైర్యంగా ఉండాలని, వైద్యులకు సహకరించాలని సూచించారు. అలాంటప్పుడే రోగులు తొందరగా కోలుకుని క్యాన్సర్‌ను జయించగలుగుతారన్నారు. సమావేశంలో అపోలో అంకాలజీ వైద్యులు డాక్టర్ రాకేష్‌రెడ్డి, డాక్టర్ వి.ప్రదీప, డాక్టర్ సుమన్ దాస్, డాక్టర్ బ్రహ్మాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో సామగ్రితో ఇబ్బందులు



పీతలవానిపాలెంలో రోడ్డుపై ఇసుక

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెం మధ్యలో గల కూడలి వద్ద రోడ్డుపైన భవన నిర్మాణ సామగ్రిని కుప్పగా వేశారు. ఇసుక, పిక్క వంటివి రోడ్డుపైకి చేరడంతో రాకపోకల సమయంలో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. దీంతోపాటు రాళ్లు, సిమెంట్ మిక్సింగ్ మిషన్‌లను రోడ్డుపైనే పెట్టారు. సంబంధిత అధికారులు స్పందించి వాహనాలకు, పాదచారులకు ఇబ్బందులు లేకుండా, రోడ్డును ఆక్రమించకుండా పనులు చేసుకునేలా చూడాలని స్థానికులు, అక్కడి అపార్ట్‌మెంట్ వాసులు కోరుతున్నారు.

ఎంటీఎస్ టీచర్లకు న్యాయం చేయాలి

- ప్రభుత్వానికి 'పీఆర్‌టీయూ' విజ్ఞప్తి



నిరసన తెలుపుతున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

బీచ్‌రోడ్డు: మినిమం టైం స్కేల్(ఎంటీఎస్) ఉపాధ్యాయులకు న్యాయం చేసి.. 'నియర్ బై రెసిడెన్సీ' జీవోను కొనసాగించాలని పీఆర్‌టీయూ ప్రతినిధులు గోపీనాథ్, నాగేశ్వరరావు, వెంకటపతి రాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఎంటీఎస్ ఉపాధ్యాయులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారానికి మూడో రోజుకు చేరుకుంది. ధర్నాలో పీఆర్‌టీయూ ప్రతినిధులు మాట్లాడుతూ 2025 బదిలీల్లో 2008, 1998 ఎంటీఎస్ టీచర్లకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా మైదాన ప్రాంతంలోని అన్ని క్లస్టర్ పోస్టులను ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ జిల్లాలో మొత్తం 184 మంది 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఉన్నారని, అందులో 84 మంది పురుషులు, 100 మంది మహిళలు ఉన్నారని వివరించారు. అలాగే జిల్లాలో మొత్తం 245 మంది 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల్లో 185 మంది పురుషులు, 60 మంది మహిళలు ఉన్నారని గణాంకాలు వెల్లడించారు. ప్రతి మండలంలో ఉన్న సింగిల్ టీచర్ పాఠశాలలో ఒక ఎంటీఎస్ టీచర్‌ను సర్దుబాటు చేయాలని సూచించారు. మైదాన ప్రాంతంలోని ప్రతి మండలంలో నూతనంగా రూపొందించిన మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఒక ఎంటీఎస్ టీచర్‌ను సర్దుబాటు చేయాలని కోరారు.

ట్రాఫిక్ సమస్యలు తప్ప ప్రయోజనం లేదు

రిలే నిరాహార దీక్షను ఆపివేయాల్సిందిగా రెండో పట్టణ సీఐ ఎర్రం నాయుడు ఉపాధ్యాయులను కోరారు. ఇక్కడ ధర్నా చేయడం వల్ల ప్రయోజనం ఏంటని, బందోబస్తు సమస్య వస్తోందన్నారు. డీఈవోను కలిసి సమస్యలను పరిష్కరించుకోవాలని వారికి సూచించారు. అయితే మూడు గంటల వరకు దీక్ష చేసి, అనంతరం డీఈవో కార్యాలయం వద్ద జరిగే టీచర్స్ కౌన్సెలింగ్‌ను అడ్డుకోనున్నట్టు యూనియన్ నేతలు తెలిపారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోగా.. తమ సమస్యను పరిష్కరించేంత వరకు ఆందోళన చేపడతామని టీచర్లు స్పష్టం చేశారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా.. ఉజ్వల భవితకు బాటలు వేసే విద్య దగ్గరగా ఉండాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల విద్యా డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు బుధవారం కృష్ణా కాలేజీలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని 15 రోజులుగా కళాశాల విద్యార్థులకు సెమినార్, పోస్టర్ పెయింటింగ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ మాదక ద్రవ్యాల వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహనకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకుని వాటికి బానిసలుగా మారిపోవడం వల్ల యువత భవిష్యత్ చిత్తవుతుందన్నారు. యువత మాదక ద్రవ్యాల జోలికి పోకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జోనల్ ఆఫీసర్ డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, డాక్టర్ బి.నాగేశ్వరరావు ఉన్నత భారత అభియాన్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.రామారావు, యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ సాయికృష్ణ, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ ఎం.బాలకృష్ణ, డాక్టర్ కె.రవిబాబు, రాజారావు డాక్టర్ జి.లక్ష్మణరావు, డాక్టర్ ఎం.శ్రీనివాస ప్రసాద్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

కంచరపాలెం: కంచరపాలెం ప్రభుత్వ ఓల్డ్ ఐటీఐ ప్రాంగణంలో నిర్వహిస్తున్న నరవ ఐటీఐలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్ల భర్తీకి అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రెండో విడత ప్రవేశాలకు సంబంధించి ఫిట్టర్ ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఆర్ అండ్ ఏసీ మెకానిక్, డిజిటల్ మెకానిక్ ట్రేడ్‌ల్లో సీట్లు మిగిలాయని తెలిపారు. www.iti.gov.in వెబ్‌సైట్‌లో జూలై 15లోపు రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆ స్లిప్‌ను తీసుకుని అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో 17లోపు నరవ ఐటీఐకి వెళ్లి వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. జూలై 21న ఉదయం 10 గంటలకు నరవ ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు అన్ని ధ్రువపత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 93932 60568, 63057 83675 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఏయూను సందర్శించిన జపాన్ ప్రతినిధులు



జపాన్ జెట్రో సంస్థ ప్రతినిధులకు ఏయూ ప్రగతిని వివరిస్తున్న వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీని బుధవారం జపాన్ దేశానికి చెందిన జెట్రో(జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) సంస్థ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విద్యార్థులకు ఉపయుక్తంగా, లబ్ధిచేకూరేలా ఉండే నూతన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకునే దిశగా చర్చలు సాగించారు. వీసీ రాజశేఖర్ జెట్రో సంస్థ ప్రతినిధులకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రగతిని వివరించారు. పర్యటనలో భాగంగా నాస్కామ్ సెంటర్, డీన్ ఔట్రీచ్ విభాగాలను ప్రతినిధులు సందర్శించారు. కార్యక్రమంలో జెట్రో తోయమ చిప్ తమురా కెన్, సీనియర్ డైరెక్టర్ జుంకి యమాపిట, డైరెక్టర్ జనరల్ కావోరు శిరయిపి, అసిస్టెంట్ డైరెక్టర్ వీర బాబు వీర్ల, డీన్ ఔట్రీచ్ ఆచార్య కె.రమాసుధ, రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.